క్లుప్తంగా

నృత్య కళాకారిణికి సన్మానం



వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన నృత్య కళాకారిణి కే.శ్రీవల్లిని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం వేల్పూర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. శ్రీవల్లి ఇటీవల సావిత్రిభాయి ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మలేషియాలో నిర్వహించిన దసరా సంబరాలలో కూచిపూడి, ఆంధ్రనాట్యంలో ప్రతిభ చూపింది. దీంతో ఆమెను సత్కరించారు. శాస్త్రీయ నృత్యంలో ఇంకా ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు బబ్బూరు ప్రతాప్‌రెడ్డి, పిట్లసత్యం, సుంకరి రాము, ప్రవీణ్ పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



నందిపేట్(ఆర్మూర్): నందిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్లు అజ్మత్, స్వాతి, పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు హేమలత, భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేఖ, ఐకేపీ ఏపీఎం గంగాధర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

వృత్తి విద్య శిక్షణ తరగతులు



ధర్పల్లి: ధర్పల్లి ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ఇంటర్ విద్యార్థులకు దసరా సెలవుల్లో భాగంగా వృత్తివిద్య లో విద్యార్థులకు వైద్య వృత్తిలో నైపుణ్యం పెంపొందించడానికి చాణక్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నిజామాబాదులోని ప్రతిభ హాస్పిటల్లో 47 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. తరగతి గదిలో నేర్చుకున్న దానికంటే చూసి చేసేదానిలో ఎక్కువ జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు.కార్యక్రమంలో చాణక్య శిక్షణ కేంద్రం చైర్మన్ ప్రణీత్,వృత్తివిద్య కోర్స్ నిపుణులు దుర్గాప్రసాద్ ,రజని తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులు, కోచ్‌లకు సన్మానం



నిజామాబాద్ నాగారం: ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు, కోచ్‌లను అకాడమీ చైర్మన్ అంజయ్య, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు బుధవారం ముప్కాల్‌లో సన్మానించారు. గత నెల 25 నుంచి 28 వరకు ముప్కాల్‌లో 35వ అంతర్ జిల్లా క్రీడాపోటీలు నిర్వహించారు. ఇందులో సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ జట్లు 2025 చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నాయి. ఈకార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే గంగాధర్ రెడ్డి , జాయింట్ సెక్రటరీ రాజకుమార్, ఎస్సై ప్రదీప్, దినేష్ సంజీవ్, థామస్, గంగారం, రాజు గంగారం, శ్రీకాంత్ గణేష్ రాము జావేద్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరికొండ : మండలంలోని కొండాపూర్ మైలారం గ్రామాల్లో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. కొండాపూర్ లో చారికి రూ. 31500, నూనె రవికి రూ 29 వేలు, రజితకు రూ 19 వేల చెక్కులను, మైలారంలో సుగ్యం చిన్నయ్యకు రూ 35 వేలు, మందపురం వనజకు రూ 16 వేలు, చల్ల ప్రసన్నకు రూ 30 వేలు, గాండ్ల రచనకు రూ 24 వేలు, గొర్రె సంతోష్ కు రూ 60 వేల చెక్కులను అందజేశారు. కొండాపూర్ లో కాంగ్రెస్ నాయకులు బుచ్చన్న చంద్ర గౌడ్ శ్రీధర్ ఆకుల జగన్ ఫారూఖ్ కిషోర్ గౌడ్ శ్రీనివాస్ రహీం ఇక్బాల్, మైలారంలో వంచ సాగర్ రెడ్డి మాజీ ఎంపిటిసి నరసయ్య విష్ణు చిన్నదాస్ సుగ్యం నితీష్ గొల్ల పెద్దన్న సుగ్యం రవి సంతోష్ గౌడ్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో రావణకాష్ట ఏర్పాట్ల పరిశీలన

బాన్సువాడ రూరల్: దసరా పండుగ సందర్భంగా ప్రతి ఏటా బాన్సువాడలోని మినీ స్టేడియంలో నిర్వహించే రావణ దహనం ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా పలు సూచనలు చేశారు. వీక్షకులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మండల నాయకులున్నారు.

శంకుస్థాపనకే పరిమితమా..?

- పోచంపాడ్‌లో ప్రారంభం కాని జీపీ భవన నిర్మాణ పనులు
- త్వరలోనే అంటూ మూడేళ్లు గడిపిన అధికారులు
- ముందుకు రాని కాంట్రాక్టర్లు





పోచంపాడ్‌లో వేసిన శిలాఫలకం.. పాత భవనంలో కొనసాగుతున్న జీపీ కార్యాలయం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులు మూడున్నరేళ్లు గడిచినా ఇప్పటికి ప్రారంభం కాలేదు. భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వం 2022 లో రూ. 20 లక్షల నిధులను మంజూరు చేసింది. అదే సంవత్సరం మార్చిలో అప్పటి పాలకులు పనులకు శంకుస్థాపన చేశారు. అదే పాత భవనంలో జీపీ కార్యాలయం కొనసాగుతుంది. 2018లో నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా పోచంపాడ్ గ్రామ పంచాయతీని ఏర్పాటు చేశారు. మండలంలోని సోన్‌పేట్ గ్రామ పంచాయతీకి అమ్లెట్ గ్రామంగా పోచంపాడ్ కొనసాగింది. సోన్‌పేట్ గ్రామ పంచాయతీ కేంద్రం పోచంపాడ్‌లోనే నిర్వహించారు. భవనం పురాతనమైనది, ఇరుకు గదులు ఉండటంతో నూతన భవన నిర్మాణం కోసం నిధులను మంజూరు చేశారు. నిధులు ఉన్న పనులు ముందుకు సాగడం లేదు. తక్కువ ఎస్ఎల్ఆర్ రేట్లతో పనులు ఉండటంతోనే కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని సంబంధిత అధికారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

సోన్‌పేట్‌లో అదే పరిస్థితి..

మండలంలోని సోన్‌పేట్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. భవన నిర్మాణం కోసం 2022లోనే గత ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులను మంజూరు చేసింది. పనులు ముందుకు సాగడం లేదు. ముప్కాల్ మండలంలో కొత్తపల్లి, నాగంపేట్‌లో నూతన పంచాయతీ భవన నిర్మాణం కోసం కొన్ని రోజుల క్రితం అధికారులు మార్కవుట్ చేశారు. వెంటనే నూతన భవన నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ఇంకా ప్రారంభం కాలేదు. నిధుల ఇబ్బంది లేదు.

– షరీఫ్, పంచాయతీరాజ్ ఏఈఈ, బాల్కొండ

మహిషాసురమర్ధినిగా అమ్మవారు



ఆర్మూర్‌లో లక్ష్మీనర్సింహ ఆలయం వద్ద చండీయాగంలో పాల్గొన్న భక్తులు


ఆర్మూర్‌టౌన్/బాల్కొండ : వివిధ మండపాల వద్ద బుధవారం దుర్గామాత మహిషాసుర మర్ధిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆర్మూర్‌లోని శ్రీ లక్ష్మీనర్సింహ ఆలయ దుర్గామాత, త్రిపుర యూత్, శివాజీయూత్, శ్రీలక్ష్మీనారాయణ మందిరంలో మహా చండీయాగం నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య భక్తులు పూజలు చేశారు. బాల్కొండ, ముప్కాల్ , మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో దుర్గామాత మండపాల వద్ద పూజలు నిర్వహించారు. మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.



ఆర్మూర్‌లోని పెద్దబజార్‌లో మహిషాసురమర్ధిని అలంకరణలో అమ్మవారు



బాల్కొండ మండల కేంద్రంలో..



నవీపేట్ లో దుర్గామాత శోభాయాత్ర

ఆకట్టుకున్న పెద్ద పట్నం

బోధన్‌టౌన్(బోధన్): శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలోగల దేవి గల్లీలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన నానిగౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారి వద్ద వేసిన పెద్ద పట్నం భక్తులను అందరిని ఆకట్టుకుంది, ఈ సందర్భంగా మాతంగి మహాబోనం ఎత్తుకొని అమ్మవారి ముందు చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



చర్చనీయంశంగా సాలూర ఎంపీపీ రిజర్వేషన్

- ఎస్సీ మహిళకు రిజర్వు
- ఒక గ్రామంలోనే ఎస్సీకి కేటాయింపు



సాలూర మండల పరిషత్ కార్యాలయం

బోధన్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జెడ్పీటీసీ,ఎంపీటీసీల రిజర్వేషన్లను ప్రకటించారు.సాలూర గ్రామాన్ని 12 గ్రామ పంచాయతీలతో కొత్త రెవెన్యూ మండలాన్ని ఏర్పాటు చేశారు. ఈ మండల పరిధిలో 7 ఎంపీటీసీ స్థానాలు కేటాయించారు. జెడ్పీటీసీ స్థానాన్ని ఎస్సీ జనరల్, ఎంపీపీ పదవిని ఎస్సీ మహిళకు రిజర్వేషన్ కల్పించారు. ఎంపీపీ పదవి రిజర్వేషన్ పై సందిగ్ధత నెలకొనడంతో రాజకీయంగా సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.మండలంలో ఓటర్ల మొత్తం సంఖ్య 17601, ఇందులో పురుషులు 8402, మహిళలు 9199 మంది ఉన్నారు.

ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్‌లు ఇలా..

మండలంలోని హున్సా ఎంపీటీసీ స్థానాన్ని బీసీ జనరల్,,జాడిజమాల్‌పూర్ జనరల్ మహిళ, కుమ్మన్‌పల్లి జనరల్ మహిళ, సాలంపాడ్ జనరల్, సాలూర క్యాంప్ ఎస్సీ జనరల్, సాలూర -1 బీసీ మహిళ, సాలూర-2 బీసీ జనరల్ రిజర్వేషన్ చేశారు. ఎస్సీ మహిళకు ఎక్కడా రిజర్వేషన్ కల్పించలేదు.ఒక్క సాలూర క్యాంప్ ఎంపీటీసీ స్థానాన్ని ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. ఇక్కడ మహిళకు బదులు పురుష అభ్యర్థి విజయం సాధిస్తే ఎంపీపీ పీఠం ఖాళీగా ఉండే అవకాశం ఉంది.ఈ అంశంపై చర్చలు జరుగుతున్నాయి. కొత్త మండలంలో ఆయా పార్టీల రెండవ శ్రేణి నాయకులు పదవులపై గంపెడాశలు పెట్టుకోగా రిజర్వేషన్‌ల ప్రకటనతో అవాక్కయ్యారు.ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



సిరికొండ : మండలంలోని రావుట్లలో పటేల్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దేవి మండపం వద్ద శివపార్వతుల కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు.

ఆలయం వద్ద దసరా వేడుకలు

సిరికొండ : మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రా మ పరిధిలోని త్రీ హిల్స్ ఆలయం వద్ద దసరా వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయం వద్ద ఒకరోజు ముందుగా దసరా వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ గా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా జమ్మి చెట్టుకు పూజలు చేశారు. పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పూజారి గణపురం రమేష్ పురోహితులు శ్రీనివాస్ శర్మ వీడిసి చైర్మన్ తలకట్ల సాగర్ ముత్యం చందర్ నాయక్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించాలి



కోటగిరిలో సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న రసూల్‌బీ, ఉద్యోగులు

రుద్రూర్: వృద్ధులను గౌరవించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రసూల్‌బీ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని శ్రీసాయి అయ్యప్ప ఆలయంలో బుధవారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ, కోటగిరి మండల సీనియర్ సిటిజన్స్ ఫోరం, టీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సీనియర్ సిటిజన్స్ శాఖ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రసూల్‌బీ హాజరై మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ ఫోరం చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ నాగనాథ్ శాస్త్రి, జి.రంగారావు, పోల కుసుమ విఠల్ గుప్తా, సీనియర్ ఉపాధ్యాయులు బి. రాజును సన్మానించారు. అనంతరం సైనికులను, రైతులను సన్మానించారు. జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు పోల విఠల్ రావు గుప్తా, కోటగిరి సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు బర్ల సత్యనారాయణ, టీఎంఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు తాటి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలి



ఉద్యోగులను సన్మానిస్తున్న ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులు

రుద్రూర్: ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు లాల్‌మొహమ్మద్ అన్నారు. మండలంలోని అక్బర్ నగర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పదోన్నతి పై సంగారెడ్డి వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాల పర్యవేక్షణ అధికారిగా బదిలీపై వెళ్లిన షేక్ గౌసొద్దీన్, బోధనేతర సిబ్బంది ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన షేక్ ఈసాను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎండీఎఫ్ అధ్యక్షులు లాల్ మొహమ్మద్, కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఉపాధ్యక్షులు సయ్యద్ సికిందర్ ఖాద్రి, కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మజీద్ సదర్ షేక్ మొహమ్మద్, షేక్ ఫహీం, ఎంఎండీఎఫ్ సభ్యులు జావిద్ హుస్సేన్, షేక్ మహబూబ్, షేక్ బాబు, షేక్ కలీం, షేక్ అన్వర్, ఖలీల్ ఖాన్, మహమ్మద్ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న దాసు

ధర్పల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వ ఆదుకోవాలని సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంట నష్టం చెందిన రైతులకు ఎకరానికి కనీసం రూ.30 పరిహారం అందించాలని కోరారు. కూలిపోయిన ఇళ్లకు సంబంధించి బాధితులకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతులకు కనీస మద్దతు ధర అందేలా చూడాలని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకతీతంగా వరద బాధితులను ఆదుకోవాలన్నారు. వరదలతోనే దెబ్బతిన్న రోడ్లను నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. నాయకులు బాలయ్య, వెంకటేష్, గంగాధర్, ప్రశాంత్, ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు బీఎస్ఎన్ఎల్ సేవలు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు

నిజామాబాద్ రూరల్: రాష్ట్రంలో మొదటిసారిగా నెలకు రూ.299 కే ఉచిత ఫోన్ కాల్స్, (అపరిమిత) 4జీ డేటా ప్లాన్ అందుబాటులో ఉందని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నగరంలోని గాంధీ చౌక్‌లోని బీఎస్ఎన్ఎల్ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ ప్రారంభించి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలో నిజామాబాద్ బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం ఉద్యోగులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నాలుగు నెలల లోపు బీఎస్ఎన్ఎల్ టవర్స్‌ను ఏర్పాటు చేసి మారుమూల గ్రామాలకు సైతం నెట్‌వర్క్ సేవలు అందిస్తామన్నారు.భవిష్యత్తులో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరెన్నో ఫ్యూచర్ ప్లాన్స్ అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జగ్గారం, బీఎస్ఎన్ఎల్ డిస్ట్రిబ్యూటర్లు కష్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల బారిన ఆర్టీసీ కాలనీ

- మాణిక్ బండార్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు
- తీవ్రంగా దోమల బెడద
- పట్టించుకోని అధికారులు

మాక్లూర్: మండలంలోని మాణిక్‌బండార్ శివారులోని ఆర్టీసీ కాలనీలో ఇళ్ల మధ్య పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో దోమల బెడద నెలకొంది. దీంతో కాలనీవాసులు జ్వరాల బారిన పడుతున్నారు. మొక్కలు ఏపుగా పెరిగి విష సర్పాలకు నిలయంగా మారాయని, బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కాలువల్లో చెత్త పేరుకు పోవడంతో దోమలు విపరీతంగా ఉంటున్నాయి. దీంతో అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. వర్షం కురిసిన ప్రతి సారి మురికి కాలువల్లో నీరు చేరుతోంది. దీంతో మురుగు రోడ్లపైకి చేరడంతో నడవడానికి ఇబ్బందిగా మారుతోంది. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఆర్టీసీ కాలనీలోని ఆరో నంబర్ రోడ్ డ్రెయినేజీ



ఆర్టీసీ కాలనీలోని ఏడో నంబర్ రోడ్ డ్రెయినేజీ



ఆర్టీసీ కాలనీలోని ఐదో నంబర్ రోడ్ డ్రెయినేజీ

అధికారులకు విన్నవించినా..



ఆర్టీసీ కాలనీలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పరిష్కరించడం లేదు. కాలనీలో డ్రెయినేజీలపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో దోమల బెడద నెలకొంది. జ్వరాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించాలి. – సురేశ్ రాజేందర్, ఆర్టీసీ కాలనీ ప్రెసిడెంట్

ఘనంగా బతుకమ్మ వేడుక



ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో బుధవారం పలు వార్డులలో మహిళలు ఘనంగా బతుకమ్మ వేడుకను జరుపుకున్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ ప్రమీద ఆధ్వర్యంలో మహిళ వైద్యులు, సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. అనంతరం సమీపం చెరువులో బతుకమ్మ నిమజ్జనం చేశారు.

ఆర్ఎస్ఎస్ నేతృతంలో నేడు విజయ దశమి ఉత్సవాలు

బోధన్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించి విజయ దశమికి వందేళ్లు పూర్తికాబోతున్న నేపథ్యంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎడపల్లి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో విజయ దశమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపార వేత్త యోగేశ్ దేశ్‌ముఖ్, వక్తగా అఖిల భారత శిక్షా టోలి సదస్య, వనవాసీ కళ్యాణ ఆశ్రమానికి చెందిన కొరిగింజ రామచంద్రయ్య విచ్చేయనున్నారని పేర్కొన్నారు. డాక్టర్ కేశవరావ్ బలిరాం హెగ్డేవార్ 1925లో ఆర్ఎస్ఎస్ స్థాపించారని నిర్వాహకులు తెలిపారు.

రూరల్ ఎమ్మెల్యేను పరామర్శించిన షబ్బీర్ అలీ



నిజామాబాద్ సిటీ: రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డిని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ పరామర్శించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని రూరల్ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల భూపతిరెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ అనారోగ్యంతో మృతిచెందారు.నుడా చైర్మన్ కేశవేణు, కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, రాజేష్ తదితరులున్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

: 9010585333
: 9849180084
: 9866958559
: 7893150102
: 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899